# హిమగిరితనయే ....

- ఓరుగంటి గోపాలకృష్ణ




బిర్లామందిర్ మెట్లెక్కుతున్నాడు చంద్రశేఖర్. పైమెట్టు దగ్గరికి వచ్చేసరికి ఆయాసం వచ్చింది. కాసేపు స్తంభాన్ని ఆనుకుని నిల్చున్నాడు. అతనికి ఏభై తొమ్మిదేళ్ళు. కాసేపు నిల్చున్న తరవాత అలుపు తీరినట్టయి, ప్రదక్షిణ చెయ్యబోయాడు. అప్పుడు కనుపించింది ఆమె. అప్పుడే దర్శనం కానిచ్చుకుని, ప్రసాదం చేతిలో పెట్టుకుని బయటకు వస్తోంది. ఆమెతో పాటు ఒక యువకుడు వున్నాడు. ఆమె ముఖంలో మంచి వర్చస్సు. ఎక్కడో పరిచయం వున్న పోలికలు. అలా తేరిపార చూడ్డం సభ్యత కాదనిపించి తల పక్కకి తిప్పుకోబోతున్న సమయంలో ఆమె కూడా అతని వైపు యధాలాపంగా తల ఎత్తి చూసింది. ఇద్దరి దృక్కులూ క్షణకాలం కలుసుకున్నాయి. ఆమె చూపులో కూడా అదే భావన.... చాలా పరిచయం అయిన ముఖమే ఇది అన్నట్టుగా.

చంద్రశేఖరం తల పక్కకు తిప్పుకుని ప్రదక్షిణకి ఉపక్రమించాడు. మనసులో అంతా ఆమె ముఖమే మెదులుతోంది.తప్పకుండా ఆ ముఖం తనకు తెలుసును. ఎక్కడ చూశాడో గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించాడు. విశాలమైన ముఖం, తిన్నని ముక్కూ, పెద్ద కళ్ళూ, గుండ్రని బొట్టు, అక్కడక్కడ నెరసిన జుట్టు రెండు మూడు పాయలు, కొద్దిగా వంకులు తిరిగిన ముంగురులు... ఆ ముఖములో అందమూ ఆకర్షణా, తేజస్సుతో కూడిన ఒక ప్రశాంతత వున్నాయి.

దేముడి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ, ఆమె వున్న దగ్గరికి చేరుతున్నప్పుడల్లా యధాలాపంగా చూసినట్టు అటువైపు దృష్టి మళ్ళించి చూశాడు. ఆమె కూడా తననే చూస్తూ వుండటం గమనించాడు. అలా ఎన్ని సార్లు ప్రదక్షిణ చేశాడో గుర్తులేదు. ఆమె ముఖంలో కొంచెం చిరునవ్వు కనిపించినట్టనిపించింది. బహుశా తను చాలాసార్లు పిచ్చివాడిలా ప్రదక్షిణ చెయ్యడం ఆమె గమనించి వుంటుందని, ఇక బాగుండదని దర్శనానికి వెళ్ళాడు.

మనసులో ఓ మూల ఆమె గురించే ఆలోచిస్తూ దేముడికి దండం పెట్టుకుని, తీర్థం, ప్రసాదం తీసుకుని బయటకు వచ్చాడు. పైవరుస మెట్లు దిగాక కుడివైపున ఇంకొన్ని మెట్లు వున్నాయి. వాటిమీద కూర్చుని ఆమె కోసం వెదక బోతుంటే దూరం నుంచి ఆమె తనవైపే రావడం చూశాడు. ఆమె దగ్గరగా వచ్చి, 'మీరు... మీ పేరు చంద్రశేఖర్ కదూ!' అని అడిగింది.

ఆ గొంతులోంచి బయల్దేరిన శబ్దతరంగాలకి అతని వూహల దొంతర్లలో ఎక్కడో ప్రకంపన కలిగింది.

"జలజలమని కురిసింది వాన, జాల్వారింది అమృతంపు సోన". మారుమూల జ్ఞాపకాల గదిలోంచి మున్నెన్నడో మరచిన తియ్యని కవితొక్కటి ఆకారం దిద్దుకున్నట్టయ్యింది...అప్రయత్నంగా..."హైమవతి!"అన్నాడు.

'అవును' అన్నట్టుగా ఒక ప్రశాంతమైన చిరునవ్వు నవ్వింది ఆమె.

'తుహిన కిరణ కోమలరేఖవో వెలుదీవెవో... ఎవ్వతెవీవు?' - నిద్రించిన భావుకత్వం నింగికెగయగా మూడు దశాబ్దాలనాటి, ముఖారవిందంతో మౌలికం చేస్తూ, "హైమవతి... నువ్వు.. మీరు హైమవతి కదూ!" అన్నాడు.

'అవును, నేను హైమవతినే. గుర్తొచ్చానే' మాటలో

ఎక్కడా ఎత్తిపొడుపు లేదు. స్వచ్ఛమైన చిరునవ్వు మాత్రమే వుంది. ఒడిదుడుకుల సంసారంలో అశాంతి, అల్లకల్లోలాలతో తల్లకిందులైన తన జీవితంలో తన మనసులో మాత్రమే నిక్షిప్తమైపోయిన భావుకత్వానికి ఓ ప్రేరణగా, ఊహాలోకాల్లోనైనా అశాంతిని తాత్కాలికంగా మరచిపోయేటట్టు జేసిన తన భావాంబర వీధి విస్తృత విహారిణి, ఇన్నాళ్ళకి మున్నెదుట సలక్షణంగా ప్రత్యక్షమైతే ఉద్వేగం ఉప్పెనై చెలరేగింది. అతని హృదయంలో కలిగే భావ సంచలనపు చాయలు ముఖంలో ప్రస్ఫుటంగా ప్రతిబింబించాయి. ఆ సంచలనం సహజమే అన్నట్టుగా ఆమె నిశ్శబ్దంగా నిలుచుంది.

ఏనాటి హైమవతి!. కాకినాడలో బాలాత్రిపురసుందరి గుడి దగ్గర ముప్ఫై సంవత్సరాల క్రితం తను ఇంజనీరింగు పాసయి పెళ్ళిచూపులకని వాళ్ళింటికి వెళ్ళాడు. అమ్మాయి అందంగా వుంది. బి.ఎ. పాసయింది. తనకి బాగానే నచ్చింది. కానీ అమ్మాయి తండ్రి పౌరోహిత్యం చేసేవారు, పెద్దగా ఆస్తి అంతస్థూ లేని కుటుంబం అని తన తలిదండ్రులకి ఆ సంబంధం అంతగా నచ్చలేదు. ఎవరో మధ్యవర్తి ద్వారా వచ్చిన సంబంధం, మొహమాటంకొద్దీ వెళ్ళి చూశారు. తీరా వెళ్ళాక అతి సాధారణంగా వున్న ఇంటి వాతావరణమూ చూసి, జాతకాలు కుదరలేదని కారణం చెప్పి వదిలేశారు. తను కూడా అడ్డు చెప్పలేదు.

ఆ అమ్మాయికి మాత్రం తను బాగా నచ్చినట్టనిపించిది. పెళ్ళిచూపుల్లో ఒక పాట పాడమని అడిగితే "హిమగిరితనయే హేమలతే...." అంటూ తన్మయత్వంతో పాడింది. కానీ తన తల్లిదండ్రులే-'అబ్బాయి పెద్ద ఇంజినీరు, అమ్మాయి కనీసం ఏ ప్రొఫెషనల్ కోర్సులైనా చేసి వుంటే బాగుంటుంది. బొత్తిగా బి.ఎ....అందులోనూ తెలుగులో... మా అబ్బాయికి ఏ డాక్టరో ఇంజినీరో చూస్తున్నాం' అని మధ్యవర్తి ద్వారా తెలిపారు. తను కూడా అంతగా పట్టించుకోలేదు. తల్లిదండ్రులు చెప్పినట్టు వినేసి ఊరుకుండిపోయాడు.

పెళ్ళిచూపులయిన కొన్ని రోజులకి ఆ అమ్మాయి తన తమ్ముడి ద్వారా చంద్రశేఖర్కి ఒక కబురు పంపింది. తనని వచ్చే శనివారం గుడిలో కలుసుకొమ్మని. చంద్రశేఖర్ వెళ్ళాడు. హైమవతి ముందర చాలా మొహమాటంగా క్షమాపణలు చెప్పింది, 'ఇలా కలుసుకోమని కబురు పంపినందుకు మరోలా అనుకోవద్ద'ని. ఆమె స్వతంగా చేసిన గ్రీటింగు కార్డు ఒకటి శేఖర్ చేతికిచ్చింది. మొదటి పేజీలో ఆమె వేసిన రేఖా చిత్రం...సముద్రకెరటాలు, పైన ఒక చిన్న మేఘం వెనకాల నుంచి బయటకు వస్తున్న సూర్యకిరణాలు. లోపల 'నవనవాలైన ఊహావర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు..' అని రాసి వుంది. తాను అది చదివి ముఖంలో ఏ భావమూ వ్యక్తపరచి వుండక పోవచ్చు..... అది గమనించి... "తిలక్... దేవరకొండ బాలగంగాధర్ తిలక్... కవితలు చదివారా మీరు?" అని అడిగింది.

"లేదు" అని తను చెప్పినప్పుడు కొంచెం నిరాశ చెందినట్టనిపించింది ఆమె ముఖం. నేనెందుకు రమ్మన్నానంటే....అమ్మాయిలు ఇలా చెప్పవచ్చునో లేదో నాకు తెలియదు. కానీ, చెబుదామనే నిర్ణయించు కున్నాను. నాకు మాత్రం మీరు నిజంగా నచ్చారు.... అందుకోసమే ఆఖరిసారిగా నా ప్రయత్నం. మీకు ఆశ్చర్యంగా వుండొచ్చు... పెళ్ళిచూపులకి వచ్చిన అబ్బాయిని ప్రేమించడం అన్నది కొంత అసహజంగా, తాత్కాలికమైన ఆకర్షణేమో అన్న అనుమానం నాకే వచ్చింది... 'వైష్ణవ మాయయో ఇతర సంకల్పార్థమో... మహాశ్చర్యంబు చింతించగన్' గలగలా నవ్వేసింది.

'అందుకనే చాలా సంశయించాను. ఎందుకో మీతో ఒక్కసారి మాట్లాడి... 'లోటు రానీయనున్నంతలోన నీకు... రమ్ము దయచేయు మాత్మపీఠమ్ముపైకి' అని నా మనసులో మాట చెప్పాలనిపించింది...'.

ఆమె అలా చెబుతున్నా అతనిలో చలనం ఎందుకు కలగలేదో! ఏ పూర్వజన్మ సుకృతమో ఆమెని కలిసే అవకాశాన్ని కలిగిస్తే, ఏ మహా శనో నెట్టనెదుట నిలచి అతన్ని స్తబ్దుణ్ణి, మృత్పిండుణ్ణీ చేశాయి.

గడచిన ఇన్నేళ్ళలో ఎన్నో సార్లు ఆనాటి ఆ అమ్మాయి రూపు గుర్తు తెచ్చుకున్నాడు, సన్నని జరీ అంచు వున్న ఆకుపచ్చ వెంకటగిరి కాటన్ చీర, తలంటుపోసుకుని కొంచెం వదులుగా వేసుకున్న పొడుగాటి జడలో కనకాంబరాలు, మరువము కలిసిన మల్లెపూదండ, నుదుట ఎర్రని గుండ్రని బొట్టు, రెండు చేతులనిండా గాజులు, కుడిచేతికి పసుపుకొమ్ము కట్టిన దీక్ష. కాళ్ళకి పసుపు పారాణి, చిన్నగా కదిలే మువ్వలపట్టీలు, బాలాత్రిపురసుందరిలా వుంది.

తరువాత కొద్దికాలానికే తనకి ఎంబిఏ పాసయిన సంబంధం కుదిరి కొంతకాలానికి లండను వెళ్ళిపోయాడు.

తనకిప్పుడు ఏభైతొమ్మిదేళ్ళు, అంటే ఈమెకి ఇంచుమించు ఏభైనాలుగు వుంటాయి. అయినా ఆమె ముఖంలో ఎంత అందమో! వున్న వయసు కంటే పదేళ్ళు తక్కువగా ఆమె, పదేళ్ళు ఎక్కువగా తానూ కనుపిస్తున్నారు. మంత్రముగ్ధుడిలా ఆమెనే చూస్తూ జ్ఞాపకాల వెల్లువలు పెల్లుబుకుతుంటే... నిశ్చేష్టుడై పోయాడు చంద్రశేఖర్.

కాసేపటికి... తేరుకుని మెల్లిగా "చాలా ఆశ్చర్యంగా వుంది కదూ... మళ్ళీ మనం ఇలా గుళ్ళో కలవడం" అన్నాడు.

'అవును. చెప్పండి, మీరెలా వున్నారు? ఎక్కడున్నారు? మీ కుటుంబం ఎక్కడుంది? మీ అమ్మా నాన్నగార్లు కులాసాగా వున్నారా?' అని అతని కళ్ళల్లోకి చూస్తూ చాలా కలుపుగోలుగా అడిగింది.

చంద్రశేఖరంకి తానెలా వున్నాడో ఏమని చెప్పాలో అర్థం కాలేదు. జీవితం ఎన్ని మలుపులు తిరిగిందో ఎలా చెప్పగలడు ఇంత తక్కువ వ్యవధిలో? ఎన్నోసార్లు అనుకున్నాడు, ఎప్పుడైనా ఆమె కనబడితే స్వచ్ఛమైన నిజాయితీతో మాట్లాడాలనీ, భేషజంతో అబద్ధాలు చెప్పకూడదనీ.

'చెబుతాను, కానీ, ముందర మీ విషయాలు చెప్పండి. ఎక్కడ వుండటం? మీ ఆయన ఏం చేస్తూ వుంటారు? ఎంతమంది పిల్లలు, మీరేంచేస్తూ వుంటారు?..' అని ఆమెనడిగాడు.

"మీరు నన్ను మీరూ అని సంబోధించొద్దు. నువ్వూ అనండి. అలాగేనా?" అని చనువుగా అంది.

"అలాగే" అని ఒప్పేసుకున్నాడు. ఇంత సాన్నిహిత్యం ఎప్పుడేర్పడింది? ఊహల్లో ఎన్నోసార్లు మాట్లాడి దగ్గరయ్యాడా తను?

"మీతో కలిసిన కొన్నాళ్ళకి నాకు చక్రపాణితో పెళ్ళయ్యింది. ఆయన కార్డియాలజిస్టు. అమెరికా వెళ్ళిపోయాను.

ఆస్టిన్‌లో వుంటాము మేము. ఇద్దరు పిల్లలు, పెద్దవాడు 'మోహనవంశి', అమ్మాయి 'నీహారిక'.

అబ్బాయి నాతో ఇక్కడే... కింద పుస్తకాల షాపులో వున్నాడు. ప్రస్తుతం ఆస్టిన్‌లో అసిస్టెంటు ప్రొఫెసర్ గా పని చేస్తున్నాడు. విడిగా హఠయోగ పాఠశాల ఒకటి పెట్టి అందరికీ యోగా, మెడిటేషనూ నేర్పిస్తాడు. నేనే వాడి ప్రథమ శిష్యురాలిని...గత పదేళ్ళుగా" అని గలగలా నవ్వేసింది.

"అమ్మాయి ప్రిన్స్‌టన్‌లో చదివి ఇప్పుడు యునైటెడ్ నేషన్‌లో పని చేస్తోంది. దగ్గర్లోనే న్యూయార్కు సిటీలో వుంటోంది. ఇంకా పెళ్ళి కాలేదు. తనకి ప్రపంచాన్ని ఓ సిగ్నేచర్‌తో, ఓ పాలసీతో మార్చేయాలన్న తపన. నేను మాత్రం ఏ ఉద్యోగమూ చేయకుండా హాయిగా ఇంట్లో కూర్చుని, నా సాహిత్యమూ సంగీతమూ వెలగపెడుతూ వుంటాను. పొద్దున్నే లేచి సంగీతం మొదలుపెట్టి, మావారు వద్దనేదాకా మార్నింగ్ రాగాస్, నూన్ రాగాస్, ఈవినెంగ్ రాగాస్ అంటూ అబ్బాయినీ కోడలునీ విసిగించేస్తూ వుంటాను... సర్లెండి మీరడిగింది తడవు, నా సొదంతా గడగడా చెప్పేసాను. మా ఆయన అంటారు. నీ స్నేహితులు కనిపిస్తే నీలో చతుష్షష్టి కళలూ పైకొస్తాయని. ఇన్నాళ్ళకి మీరు కలిసిన ఆనందం మరి. మీరు చెప్పండి మీగురించి..."

ఆమె గొంతు వింటుంటే ఎంతో హాయిగా వుంది. తన జీవితానికి ఆమె జీవితానికి ఎంత కాంట్రాస్ట్!

శేఖర్ కాసేపు కూగి చెప్పాడు... హైమవతిని కలిసిన కొన్నాళ్ళకే తనకి బాంబేలో ఎంబిఎ చదివిన అమ్మాయితో పెళ్ళవడమూ, లండన్ వెళ్ళి తను లండన్ మెట్రో రైల్‌లో ఎలెక్ట్రికల్ ఇంజనీరుగా పని చేయడమూ, కొడుకు ఆనాల్, అమ్మాయి కరిష్మా పుట్టడమూ, కొడుకు కాలేజి వదిలేసి ఇండియన్ గ్రాసరీ షాపు పెట్టి అది పని చెయ్యక, ప్రస్తుతం ఇండియన్ రెస్టారెంటు బిజినెస్సు పెట్టడమూ, తనతో పనిచేస్తున్న పోలిష్ అమ్మాయిని పెళ్ళి చేసుకుని విడిగా వెళ్ళిపోవడమూ, కూతురు ఒక బ్రిటిష్ బాయ్ ఫ్రెండుతో కలిసి వుండటమూ, ఇంట్లో మనస్పర్థలూ, దెబ్బలాటల మధ్యలో తన వుద్యోగం పోవడమూ, భార్య తనకి విడాకులిచ్చేసి, ఒక పంజాబీ రెస్టారెంటు బిజినెస్ మేన్‌తో వెళ్ళి పోవడము.... అన్నీ నిబ్బరంగా, నిస్సంకోచంగా, నిర్లజ్జగా చెప్పాడు.

హైమవతి మాట్లాడకుండా, ముఖంలో ఏ భావనా కనుపించకుండా జాగ్రత్తగా వింది.

చివరిలో శేఖర్ అన్నాడు "నీ ఎగిరిన జీవ విహంగం, నా పగిలిన మరణ మృదంగం...". గబుక్కున హైమవతి అతని చెయ్యి పట్టుకుని ఆపేసింది.

"మిమ్మల్ని కించ పరచడం కోసమని అడగ లేదు..." ఇంకా ఏదో చెప్పబోతుంటే శేఖర్ వారించాడు.

"హైమవతీ, ఎన్ని సార్లో నా ఊహల్లో మెదిలావు. ఇన్ని కలతల్లోనూ నాకు నీ ఊహలే ఆలంబన

అయ్యాయి...." ఇంకా ఎన్నో చెప్పాలనుకున్నాడు కానీ తన్నుకొస్తున్న ఆలోచనల కెరటాలలో ఊగిసలాడి పోయాడు. మాటలుకన్నా మనసు ముందుకి పరుగెట్టి గొంతుకి అడ్డుపడింది. కానీ మళ్ళీ ఈ అవకాశం రాదు... ఎంత తపించిపోయాడో ఈ అవకాశం కోసమని... ఎప్పుడైనా కనిపిస్తే ఒక్కటి అడగాలనీ, తను ఒక్కసారి ఆమె గొంతులోంచే మళ్ళీ వినాలనీ...

"హైమవతీ, నువ్వేమనుకోనంటే ఒక విషయం అడగనా? ఒక్కసారి... హిమగిరి తనయే హేమలతే.... పాట పాడవా?"

అతని మనసులో ఎప్పుడో కలగవలసిన చలనం, ఒక జీవితకాలం ఆలస్యంగా కలిగింది....

హైమవతి శేఖరం ముఖంలోకి దీర్ఘంగా చూసింది. అప్పుడు గమనించింది అతని కన్నుల్లో సన్నని నీటి పొరనీ, దాని కింద కన్నీటి కెరటాలనీ, ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో ప్రళయ ప్రభంజనాలనీ, ముడుతలు పడిన ముఖంలో ఎండిపోయిన నెగళ్ళనీ, గుండె సంద్రంలో బడబాగ్నినీ. చంద్రశేఖరం గళంలో హాలాహలం కనుపించింది. మండిపోతున్న గుండెల్ని చల్లపరచటానికి శిరస్సున గంగమ్మ మాత్రం కనుపించలేదు. అర్థం అయ్యింది. తానొక చిన్ని చినుకై, మంచుతునకై అతనిమీద కురిస్తే తప్పులేదని నిశ్చయించుకుంది. పరిసరాలను లెక్కచెయ్యకుండా, ధ్యాన నిమగ్నయై, నెమ్మదిగా కన్నులు మూసుకుని, గొంతు సవరించి మొదలుపెట్టింది...

"హిమగిరితనయే హేమలతే... అంబ ఈశ్వరి శ్రీ లలితే..."

గగనపథవిహార గంధర్వ సమసంగీత ఝరి ఒక్కటి చినుకై, వానై, వరదై, వెల్లువై, కల్లోలమై పెల్లుబికింది. కరడు గట్టిన కఠిన కుటిల నిరంకుశ నిరాశ, నిస్తేజిత స్తబ్దతలో ఉత్తేజ జాహ్నవి ఉరకలెత్తింది. అతని మనసొక ఇక్షు సముద్రమైపోయింది. శుద్ధధన్యాసిలో ధన్యమై పోయిన ప్రాణశక్తి విశుద్ధిచక్రంలో ప్రవేశించింది. ఆదితాళంలో అనాహత చక్రం అధిరోహించింది.

పాట అయిన తర్వాత కొంతసేపటి వరకూ నిశ్శబ్దం... ఆమెకు తెలుసును, వేడెక్కిన ఎడారిలో వాన పడితే ఆవిరి పైకెగసి కమ్ముకుంటుందని... మెల్లిగా అతని చెయ్యి తాకింది. ఆ తర్వాత ఆ చేతిని తన రెండు చేతుల్లోనూ తీసుకుని ఆర్ద్రతతో నొక్కింది. అతని చేతివేళ్ళు కూడా ఆమె అరిచేతి చుట్టూ బిగుసుకున్నాయి.అలా ఎంతసేపో వుండిపోయారు... మౌనంగా.

దూరంగా అబ్బాయి మోహనవంశి తమ వైపు రావడం ఇద్దరూ గమనించారు. హైమవతి తన చేయి పట్టు సడలించే ప్రయత్నం చేయలేదు. చంద్రశేఖరం మాత్రం కంగారుగా చెయ్యి వదిలించుకోడానికి ప్రయత్నించాడు. ఆమె అతని చేతిని మరింత గట్టిగా పట్టుకుని "ఏమీ ఫరవాలేదు" అన్నట్టుగా మౌనంగా కళ్ళతోనే చెప్పింది.

ఇంతలో ఆ అబ్బాయి తల్లి దగ్గరికి వచ్చాడు. హైమవతి శేఖరం చేయి ఇంకా పట్టుకునే "మా అబ్బాయి- మోహనవంశి. వంశీ, ఈయన నా చిన్ననాటి స్నేహితులు... చంద్రశేఖరం గారు" అని పరిచయం చేసింది.

"నమస్కారమండీ" అని వంశి కొంచెం తల వంచి నమస్కరించాడు.

శేఖరం తన కుడి చేయిని హైమవతి చేతుల్లోంచి విడిపించుకుని, గొంతు సవరించుకుని "నమ.... నమస్కారం..." అని అనగలిగాడు. వంశి, తన తల్లికేసి చూసి, "అమ్మా, నేనింకా కాసేపు ఆ బుక్ స్టాల్‌లో వుంటాను అని చెప్పడానికి వచ్చాను" అన్నాడు.

"అలాగే, నేనటు వస్తాలే!" అని హైమవతి అంది. శేఖరానికి మళ్ళీ నమస్కారం చేసి వంశీ అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. ఆ అబ్బాయిలో వుట్టిపడుతున్న అందానికీ, మర్యాదకీ ముగ్ధుడైపోయాడు శేఖరం.

'మకరాంక శశాంక మనోజ్ఞ మూర్తి' అని మనసులోనే అనుకున్నాడు. మోహనవంశి! నీహారిక! ఎంత మంచి పేర్లు పెట్టుకుంది పిల్లలకి! ఆ పేర్లు వింటుంటే గుండెలు పులకరించిపోయాయి.

అలా హైమవతి చేతుల్లో తన చెయ్యి వుంచి... మౌనంగా ఎంతోసేపో వుండిపోయాడు.ఆ సాయంకాలం అతని మీద అమృతమే కురిసింది. హైమవతి కూడా సమయంతో నిమిత్తం లేదన్నట్టుగా....నిశ్శబ్దాన్ని కానుక ఇచ్చింది అతనికి.

ఆఖరికి మెల్లగా అన్నాడు...' 'అనంత చైతన్యోత్స వాహ్వాన్ని వినిపించుకోలేకపోయాను...." ఆమె గబుక్కున తలెత్తి అతని కన్నుల్లోకి చూసింది.

"తిలక్....దేవరకొండ బాలగంగాధర తిలక్... అమృతం కురిసిన రాత్రిలోనిది..." ఇంక మాట పెగల్లేదు. హిమగిరి కరిగి గంగమ్మే గొంతులో ఉరికిందో, అమృతమే గుటక వేసాడో మరి!".

******